క్లుప్తంగా

ముక్కంటి సేవలో కన్నడ హీరో



ఆలయంలో హీరో దర్శన్, ఎమ్మెల్యే మధు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం కన్నడ హీరో దర్శన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి, జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు పాల్గొన్నారు.

వెండి కవచానికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహుదూరుపేట తెట్టు ప్రాంతంలోని ప్రసిద్ధ శ్రీనల్లగంగమ్మ ఆలయానికి రైల్వేకోడూరుకు చెందిన తోట రజనీకాంత్ దంపతులు తమ తల్లిదండ్రులు విజయరామ్, సరోజమ్మ జ్ఞాపకార్థం రూ.25 వేలు విరాళంగా అందజేశారు. ఆలయ చైర్మన్ కంతా రమేష్‌ను కలిసి ఈమొత్తాన్ని అందజేసి, వెండి కవచం తయారీకి వినియోగించాలని కోరారు. దాతలకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు అనిల్, యాదగిరి, నారాయణ, పూజారి రమణ, మల్లి పాల్గొన్నారు.

గుమ్మళ్లమ్మకు పొంగళ్లు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచన పుత్తూరులో గ్రామ దేవత గుమ్మళ్లమ్మకు గ్రామస్తులు శుక్రవారం పొంగళ్లు నివేదించారు. ఉదయం అమ్మవారి విగ్రహాన్ని పాలు, పవిత్ర జలాలతో అభిషేకించి, విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పొంగళ్లు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. పంటలు బాగా పండితే పొంగళ్లు పెట్టడం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు తెలిపారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

డ్రైవర్లకు అప్రమత్తత అవసరం



ర్యాలీలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

సత్యవేడు: రహదారి నిబంధనలు పాటిస్తూ అప్రమత్తతతో బస్సులు నడిపితే ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోవని సత్యవేడు ఆర్టీసీ డీఎం కె.వెంకటరమణ అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డీఎం మాట్లాడు తూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్ఎంయూఏ, ఈయూ, వైఎస్సార్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రేణిగుంట: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ నాగేశ్వర రావు పరిశీలించారు. రేణిగుంట, ఎల్లమండ్యం, తాతయ్యకాల్వ, గాజులమండ్యం పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. మండల సర్వేయర్ సురేష్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు పాల్గొన్నారు.

గరుడ సేవలో వీరరాఘస్వామి

నారాయణవనం: స్థానిక శ్రీకనకవల్లీ, వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గరుడ సేవ నేత్రపర్వంగా జరిగింది. ఉదయం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ఏడు గంటలకు ఊంజల్‌సేవ వేడుకగా జరిగింది. 9 గంటలకు గరుడవాహనంపై శ్రీవీరరాఘవస్వామి అధిష్టింపజేసి ట్రాక్టర్‌పై కొలువుదీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

జగనన్నతో జనరంజక పాలన



సదాశివకోనలో కరపత్రాలతో బియ్యపు పవిత్రారెడ్డి



గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న పవిత్రారెడ్డి

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు
- ఎన్నికల ప్రచారంలో బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని సదాశివకోన అటవీప్రాంతంలో, పాయిల్ సెంటర్ గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. మధ్యాహ్నం సదాశివకోన అటవీ ప్రాంతంలో గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆమె మాట్లాడుతూ పేదల అభ్యున్నతే అజెండాగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వానికి, ఇప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. సీఎం జగనన్న ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నేరవేర్చినట్లు చెప్పారు. నవరత్న పథకాల ద్వారా పేదల ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి రూ.లక్షల లబ్ధి అందిందని తెలిపారు. ఈ విషయం బ్యాంకు ఖాతాలే తెలియజేస్తాయన్నారు. రాష్ట్రంలో మెరుగైన ప్రజా పాలనకు సీఎం జగనన్న కీలక సంస్కరణలు చేట్టారని పేర్కొన్నారు. ఈ సంస్కరణలు అన్నిరంగాలలో ప్రగతికి సోపానంగా నిలుస్తున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలు ఇలాగే మన ఇంటికే చేరాలంటే జగనన్న సైనికుల్లా పని చేద్దామని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించుకుందామని పవిత్రారెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌లు సుబ్రమణ్యం, మోహనప్రియ, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, నాయకులు మధు యాదవ్, జీపీ యాదవ్, సాయి, సయ్యద్ కరీముల్లా, శ్రీమంతుల రామయ్య ఆచారి, గురునాథం, గుణశేఖర్ నాయుడు, సంతోష్, వెంకటేష్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



పిచ్చాటూరు: అడవికొడియంబేడులో అవగాహన



రేణిగుంట: ఆర్.మల్లవరంలో ర్యాలీ

పిచ్చాటూరు: బాల్య వివాహాల నిర్మూలనపై శిశు సంక్షేమ శాఖ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం అవగాహన కల్పించారు. మండలంలోని అడవికొడియంబేడు, పులికుండ్రం పాఠశాలల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మరియమ్మ పాల్గొని ప్రసంగించారు. బాల్య వివాహాల వల్ల బాలికలకు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. చిన్న వయస్సులోనే గర్భం దాల్చడం వల్ల తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండలేని పరిస్థితి తలెత్తుతుందని తెలిపారు. జీవితం పట్ల సరైన అవగాహన ఉండదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అనర్థదాయకం

రేణిగుంట: బాల్య వివాహాలు అనర్థదాయకమని రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో కృష్ణమంజరి అన్నారు. మండలంలోని ఆర్.మల్లవరం హైస్కూల్ విద్యార్థులతో కలసి 'భేటీ బచావో–భేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. కిశోర బాలికలకు ఎదురయ్యే శారీరక, మానసిక సమస్యలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టడం అందరి బాధ్యతని తెలిపారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హేమ, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

నాగలాపురం: మండలంలోని కారణి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో బాల్య వివాహం నిర్మూలనపై విద్యార్థులతో ర్యాలీనిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి శైలేంద్ర, ఉపాధ్యాయులు, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: బాల్య వివాహాలతో అనర్థాలు వాటిల్లుతాయని, అలాంటి నిర్ణయాలకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీఓ దేవకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక హైస్కూల్‌లో బాల్య వివాహాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం రమణయ్య, సీసీఆర్ సంస్థ అధ్యక్షుడు గుత్తి త్యాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, మహిళా పోలీస్ ప్రసన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

సత్యవేడు: దాసుకుప్పం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజ్ కిరణ్ తెలిపారు. వినియోగదారులు గుర్తించి సహకరించాలని ఏఈ కోరారు.

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు, బత్తలవల్లం, వరదయ్యపాళెం, సంతవేలూరు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జ్ ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

నాగలాపురం: నాగలాపురం మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జైసాయి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్లలో పనులు కారణంగా సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

భరద్వాజ తీర్థంలో భక్తులకు అన్నదానం



భరద్వాజ తీర్థంలో అన్నదానం



అంకాళమ్మ ఆలయం వద్ద..

శ్రీకాళహస్తి: పట్టణంలోని భరద్వాజ తీర్థంలో శుక్రవారం శ్రీసత్యవ్రత భాస్కరక్షేత్ర అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అనదానం జరిగింది. తై అమావాస్యను పురస్కరించుకుని శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారికి భరద్వాజతీర్థంలోని శివాలయంలో విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. అక్కడికు విచ్చేసిన భక్తులకు ట్రస్టు ప్రతినిధులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శ్రీసత్యవ్రత భాస్కరక్షేత్ర అన్నదాన ట్రస్టు వారు ఏటా తై అమావాస్య రోజున భక్తులకు అన్నదానం చేయడం సంతోషకరమన్నారు.

అంకాళమ్మ ఆలయంలో..

శ్రీకాళహస్తి పీవీరోడ్డులో వెలసిన అంకాళమ్మ ఆలయం వద్ద శుక్రవారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ రెండేళ్లుగా ప్రతి అమావాస్య రోజున భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. నిర్వాహకులు గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, ఉమేష్‌రావు, క్రాంతికుమార్, డాక్టర్ కృపానిధి, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, సావిత్రిబాయి, మాధవ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ 4వ విడత ఆసరా

శ్రీకాళహస్తి: మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్ ఆసరా 4వ విడత కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం



సత్యవేడు: మండలంలోని ఇరుగుళం పంచాయతీలో మండల పరిషత్ నిధులు రూ.9లక్షల వ్యయంతో సర్పంచ్ శేఖర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సునీల్ కుమార్‌రెడ్డి శుక్రవారం సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించారు. పంచాయతీ పరిధిలోని స్టేట్‌బ్యాంకు వీధిలో 225 మీటర్ల సిమెంట్ రోడ్డు నిర్మించనున్నారు. పార్టీ జిల్లా యువత ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, ఏఈ దేవిప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

సత్యవేడు: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ శ్యాం ప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో సలహా మండలి సమావేశం జరిగింది. ఏడీఏ సుబ్రమణ్యం మాట్లాడుతూ రైతులు ఈ పంట నమోదు ద్వారా క్రాప్ ఇన్సూరెన్స్, వడ్డీ మాఫీ, ఇతర ప్రోత్సాహకాలు పొందవచ్చని తెలిపారు. వ్యవసాయ అధికారి మురళి, ఉద్యాన అధికారి రాధారాణి, వీఏఏ స్వర్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారులు గాయపడ్డారు. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు.. వెంకటగిరికి చెందిన వినోద్(23) ద్విచక్ర వాహనంలో తిరుపతికి వెళుతున్నాడు. మార్గమధ్యమంలో సీతారాంపేట వద్ద ముందు వెళుతున్న బస్సును అధికమించబోయి అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.53,984 రికవరీకి ఆదేశం

నారాయణవనం: మండలంలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లెక్కలు తేలని పనులకు సంబంధించి రూ.53,984 రికవరీకి డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన 16వ సామాజిక తనిఖీ బహిరంగ విచారణ సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధి హామీలో రూ.9,600, పంచాయతీ రాజ్ పనుల్లో రూ 44,384 రికవరీకి పీడీ ఆదేశించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా అంబుడ్స్‌మెన్ రాసరాయనాయుడు, విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, ఏపీడీ సరిత, ఎంపీడీవో కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఏపీఎం సుకన్య, జిల్లా క్వాలిటీ కంట్రోల్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా తై అమావాస్య పూజలు





నారాయణవనం: ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి, శ్రీకాళహస్తి: స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

నారాయణవనం: మండలంలోని పలు ఆలయాల్లో గురువారం తమిళ తై మాసం సందర్భంగా అమావాస్య పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని అవధూత శ్రీసొరకాయల స్వామి ఆలయంలో గురువారం రాత్రి హోమగుండ పూజ, రథోత్సవం, ఊయ్యాలసేవ నిర్వహించారు. తమిళనాడు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం శ్రీసొరకాయల స్వామికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి సుందరంగా అలంకరించి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే స్థానిక వీరరాఘవస్వామి ఆలయంలో అమావాస్య పూజల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.



వీరరాఘవస్వామి ఆలయ పూజల్లో భక్తులు

పురవీధుల్లో శివపార్వతుల విహారం

శ్రీకాళహస్తి: తై అమావాస్య సందర్భంగా శుక్రవారం శ్రీగంగాదేవీ,జ్ఞానప్రసూనంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరస్వామి పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అంతకు ముందు శ్రీస్వామి, అమ్మవార్లను భరద్వాజ తీర్థంలోని శివాలయానికి వేంచేపు చేసి పూజలు చేశారు.

సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న ఏఈఆర్ఓ నరసింహులు

సత్యవేడు: రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణలో జరిగేలా అన్ని శాఖల సెక్టోరియల్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి(అసిస్టెంట్) నరసింహులు సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏడు మండలాల తహసీల్దార్లు, నియోజవర్గ పరిధిలోని ఎన్నికల సెక్టోరియల్ అధికారులుగా నియమితులైన వారితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామలకు పోలీసు బందోబస్తుతోపాటు లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. గత ఎన్నికల్లో అల్లర్లు, గొడవలు చేసిన వ్యక్తులు, నేర చరిత్ర కలిగిన వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సీఐ దివాకర్ మాట్లాడుతూ ఎన్నికల విధులకు వెళ్లే సిబ్బంది గ్రామాల్లో నాయకులు ఇళ్లకు వెళ్లి భోజనాలు చేయకూడదని తెలిపారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్లు కె.రామాంజనేయులు(సత్యవేడు), పి.శివశంకర్(నారాయణవనం), దయభారతి(వరదయ్యపాళెం), ఎం.శ్రీనివాసులునాయక్(కేవీబీపురం), ఎం.బాలకృష్ణన్(బీఎన్ కండ్రిగ), ఎస్ఐ వీరాంజనేయులు, ఏడు మండలాల సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం





బీఎన్‌కండ్రిగ: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ దివాకర్, సత్యవేడు: మందుల కిట్ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: జగనన్న ఆరోగ్య సురక్ష మెరుగైన వైద్యం అందుతోందని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. మండలంలోని పార్లపల్లె సచివాలయంలో వైఎస్సార్ క్లినిక్ వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. స్పెషలిస్టు వైద్యులు రాజేశ్వరి, సతీష్, కంటి వైద్యులు నారాయణస్వామి 420 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పైసా ఖర్చు లేకుండా ఉచితంగా 7 రకాల పరీక్షలు చేసి, మందులు, కంటి అద్దాలు అందజేస్తున్నట్లు తెలిపారు. సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

సత్యవేడు: మండలంలోని శిరునంబూదూరు సచివాలయ పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో సర్పంచ్ జానకి అధ్యక్షతన శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ పర్యవేక్షణలో దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి మురళీకృష్ణ, తిరుపతి రుయా ఎముకల స్పెషలిస్టు సందీప్, జనరల్ ఫిజీషియన్ సి. సందీప్‌యాదవ్ కలసి 362 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. 12 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు, 24 మందికి కంటి పరీక్షలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు సుధాకర్, సెక్రటరీ లోకేష్, ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బలిజ సంఘం నూతన కమిటీ



నూతన కమిటీతో దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: బలిజ సంక్షేమ సంఘం పట్టణ నూతన కమిటీ శుక్రవారం జరిగిన సమావేశంలో ఏర్పాటైంది. ఎన్నికల అధికారిగా పోలస్వామి స్వర్ణమూర్తి వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. గౌరవాధ్యక్షుడిగా గాజుల సత్యనారాయణ, అధ్యక్షుడిగా ఉప్పు కృష్ణరాయల్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పూల కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా డీవీ నారాయణ, సి.జయగోపాల్, సుకుమార్, బుగ్గ ప్రసాద్, మున్నా రాయల్, కొట్టే సురేష్, బుల్లెట్ జయశ్యామ్, ప్రధాన కార్యదర్శిగా కంతా ఉదయ్‌కుమార్, కార్యదర్శులుగా రాజశేఖర్, మొగరాల గణేష్, కిషోర్, మద్దెల లీలాకుమార్, పోలాస్వామి కార్తికేయన్, కోశాధికారిగా నవనీతకుమార్, ప్రచార కార్యదర్శులుగా కోలా వెంకటేశ్వరరావు, సిద్దులగారి మురళి, చక్రాల మహేష్, పూడి రవికుమార్, సహకార్యదర్శులుగా కిట్టు, శెట్టిపల్లి శివకుమార్, జీవి అమర్ నాథ్, పనబాకం గోపాల్‌లను ఎన్ను కున్నారు.

తహసీల్దార్ బాధ్యతలు స్వీకారం



శ్రీకాళహస్తి: తొట్టంబేడు తహసీల్దార్‌గా శివరామ సుబ్బయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఓజిలి నుంచి ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ సుధీర్‌రెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్నారు.

ఆల్బెండజోల్‌తో రక్తహీనత నివారణ





శ్రీకాళహస్తి: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీలత, బీఎన్‌కండ్రిగ: మాత్రలు మింగిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్తహీనత, నీరసంతో ఎదుగుదల లోపాలు తలెత్తుతాయని, వీటి నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగాలని ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీలత తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అల్బెండజోల్ మాత్రలను అందజేశారు. అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కూడా జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: ఆల్బెండజోల్‌తో చిన్న పిల్లల్లో నులిపురుగులను నివారించవచ్చని మండల వైద్యాధికారి దివాకర్ తెలిపారు. ఆయన శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎంపీడీవో షాలెట్‌తో కలసి విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. హెచ్ఎం రమణయ్య, సీహెచ్ఓ వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పిచ్చాటూరులో

పిచ్చాటూరు: మండలంలో 5,250 మంది చిన్నారులతో నులిపురుగు మాత్రలను శుక్రవారం మింగించారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సింగిల్ విండో చైర్మన్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి, సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి మాత్రలను విద్యార్థులకు అందించారు. వైద్యాధికారి హమీద్ మాట్లాడుతూ మండలంలో 19 ఏళ్ల లోపు ఉన్నవారు 5,519 మంది ఉండగా, 5,250మంది(90)కి మాత్రలు మాత్రలు అందజేశామన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ హేమమాలిని, సీహెచ్ఓ శివయ్య, హెచ్ఎం సుధాకర్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సత్యవేడు మండలంలో..

సత్యవేడు: దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్లు, ఏఎన్ఎంలు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. అంగన్‌వాడీలు, ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో చదువుతున్న 9,130 మంది విద్యార్థులకు మాత్రలు వేసేలా చర్యలు తీసుకున్నారు. హెచ్ఎం కోటీశ్వరం, ఉపాధ్యాయులుపాల్గొన్నారు. కాళమనాయుడుపేట కార్యక్రమంలో ఎంఈఓ పాల్గొన్నారు.

రేణిగుంట మండలంలో..

రేణిగుంట: నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని(డీ వార్మింగ్ డే) పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఛత్రప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో 3 నుంచి 19 వయస్సు కలిగిన వారికి మాత్రలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 19,350మందికి గాను తొలిరోజు 18, 991మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: నులిపురుగులను ప్రారంభంలోనే నివారించాలని వైద్యాధికారి నాగరాజు అన్నారు. మండలంలోని పాపానాయుడుపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ఆయన అల్బెండజోల్ మాత్రలను మింగించారు. అలాగే మండలంలోని పంగూరు ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ–2 దయాకర్ రావు మాత్రలు మింగించారు.

వరదయ్యపాళెం మండలంలో..

వరదయ్యపాళెం: మండలంలోని వరదయ్యపాళెం హైస్కూల్, జూనియర్ కళాశాల, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో తొలిరోజు 6230 మంది విద్యార్థులకు గాను 5881 మందికి మాత్రలు అందజేసినట్లు తెలిపారు.



పిచ్చాటూరులో..



సత్యవేడు: కాళమనాయుడుపేటలో..



వరదయ్యపాళెం హైస్కూల్‌లో..